# ఆ ద న లు సు

పి. రామలక్ష్మి

అమరావతికి ఎక్స్కర్షన్ కని వచ్చిన స్కూలు కుర్రాడు-పదహారేళ్ళ రాము మాటి మాటికి చేతివాచీ (వాళ్ళన్నయ్యదే) చూసుకుంటుంటే సూర్యారావు వెక్కిరించాడు.

"లేవోయ్! మా చెల్లాయి ఎదురు చూస్తుంటుంది. సాయంత్రం ఆరుకల్లా చేరుకో లేమంటావ్?"

"విక్షేపంలా చేరతాంగాని - అలా శిల్పాలకేసి వెతదాం రా. ఇక్కడున్న కాస్సేపయినా ఆ శక్తి ఎట్మాస్ఫియర్ని మర్చిపోవాలి మనం!" అన్నాడు సూర్యారావు పెద్ద మొగరాయుడిలా.

చేసేదిలేక రాముా కదిలాడు.

*　　*　　*

ఏదో బుజ్జి శిల్పం చూస్తుంటే రాముకి తటాలున చెల్లాయి గుర్తొచ్చింది.

వాళ్ళింట్లో "జనని" అంటే అందరికీ ముద్దు. అమ్మకి మరీ ముద్దు. ఆరేళ్ళప్పటి నుంచే నాలిక కంఠంలోంచి అమృతధారలు జాలువారటం చూసి మురిసి, ముద్దుగా మాట కట్టించి, ఎవరెవరో ఏడు వచ్చేసరికల్లా సంగీతం ఒక్లో (ఇంటిదగ్గరే వున్నమాట) వేయించేసింది వాళ్ళమ్మ.

ఆ ఇంటాయనకి- సంగీతం అంటే అర్థం- చెవిలో ఇల్లు కట్టుకుని, ఆ యింట్లో రాత్రి చితగ్గొట్టడం.

అయినా 'జనా' మీద ముద్దు కొద్దీ ఏమీ అనలేక పోయాడు.

"నాన్నగారూ! సినిమాకి వెళ్లాం" అంటే ఒప్పుకుంటాడు.

"డ్రామా కెళ్ళొచ్చాం" అంటే "చావండి" అంటాడు.

"సంగీత కచేరీకి వెళ్లాం" అంటే చితగ్గొడతాడు. డబ్బులు దండుగ చేశారంటూ రంకె లేస్తాడు.

*　　*　　*　　*

రామూలో తొందర పుట్టింది. ఎందుకు తనొచ్చాడా అనిపించింది. టైము ఇంత ముందు కెందుకు అప్పుడే పరుగెత్తాలా అనిపించింది.

అయినా 'స్పెషల్‌బస్సు' తిరుగుముఖం పట్టేసరికి సరిగ్గా నాలుగు- సాయంత్రం. అప్పటికీ డ్రైవ రెంతకూ రాకపోయేసరికి ఒళ్లు మండింది రాముకి. తనే డ్రైవరుసీట్లో కూచుండిపోదామన్నంత ఆతృత ముంచుకొచ్చింది.

వాచీ 'నాలుగు' చూపించేసరికి 'జనా'లో ఆత్రుత మేలుకుంది, 'అన్నయ్య నాలుకల్లా వచ్చేస్తానన్నాడే!' అనుకుంది.

పదేళ్ళ ఆ అమ్మాయి ఆతృతచూసి అమ్మ నవ్వుకుంది.

"అమ్మా! అన్న ఇంకా రాలేదేమే? ఎలా వెళ్ళేదే మరి?" అంది దగ్గిరజేరి.

"పిచ్చిమొద్దూ! వచ్చేస్తాళ్లే!" అందావిడ ఎంతో కమ్మగా.

'కాదు- ఇప్పుడే రావాలి! ఎలా?' కొశ్చన్ మార్కులా వీధిగుమ్మంలోకి ఓసారి వెళ్లి తిరిగి వచ్చేస్తోంది జనని.

*　　*　　*

'ఈ ఊళ్లో ఇది వరకు సంగీత కచేరీలు అవకేం? అయ్యాయి, అయ్యాయిట! కాని అప్పుడెప్పుడూ లేని, రానిఉత్సాహమేదో తన్ని తలమునక లైసేస్తున్నది.'

జననికి ఒక నిముషానికి ఒక క్షణం చొప్పున గుండె కొట్టుకుంటున్నది.

అయిదయింది - గాని అన్నయ్య రాలేదు, గిన్నయ్య రాలేదు.

జననికి విసుగొచ్చింది; ఉత్సాహం చావ లేక తిరిగి ఆ పిల్ల దగ్గరకే వచ్చింది. "ఈ అన్నయ్యా గిన్నయ్యా ఇకరాడు కామోసు" అని విసుక్కుని, మళ్ళీలేని ఉత్సాహాన్ని తెచ్చుకొని నిలబడింది.

"అమ్మా! అన్నయ్య ఇవాల్టి కక్కడే ఉండి పోతాడు కామాల్నే! నేనొక్కదాన్నీ వెళ్తే ఏమైందే?" అంది జాలిగా.

"ఛ—నోర్మూయ్యి! ఒకత్తీ వెడుతుందిట! మెళ్ళో ఆ గొలుసు లాక్కుని పీక పిసికిపోతే ఎవడైనా, నా గతేంగాను—" జనని కొసరు పిల్లీ కావటంచేత వాళ్ళమ్మ, అది ఉలిక్కి పడేట్టు కేక వేసింది.

మళ్ళీ మంచి చేసుకునేసరికి జననికి తాతలు దిగొచ్చారు. "అమ్మా! మరేం, నువ్వెప్పుడైనా సంగీత కచేరీ చూశావటే? ఎలా ఉంటుందే?"

'ఆఁ-మీ నాన్నగారు బలే బాగా చూపిస్తారు కచేరీ! గాడిద కచ్చేరీ చూపించారు!"

బిక్క మొగం వేసుకుని మళ్ళీ వీధి వాకిట్లోకి వెళ్ళి, మలుపు వేపు ఆశగా తొంగి చూసింది.

ఉఁహూ - పోనీ-

మళ్ళీ ఆశ;-పోనీ పెద్దన్నయ్యని బతిమాలు కొంటేసరి! కాని వాడెక్కడ దొరుకుతాడు! ఎంతసేపూ వాడికి క్లబ్బులూ, ఇంగ్లీషు సినిమాలున్నూ. ఎంత దగా చేశావురా రామూ అన్నయ్యా!

వీధిలో కారుబుర్రుమంది. ఎదురు చూస్తున్న కొద్దీ కావల్సిన వాళ్ళు రారని, లోప లెక్కడో నిలబడి ఎదురు చూస్తున్న జనని గుండెలు జలజల మనగా వీధిలోకి పరుగెట్టు కొచ్చేసింది. ఉఁహూ- రామూవాళ్ళ బస్సు కాదది. ఎదురింటివాళ్ళ పెళ్ళిపిలుపుకోసం వచ్చిందా కారు.

కొండంత ఆశ ఆకాశమంత నిరాశ అయింది.

ఎంత చంపినా ఈ ఆశ లేచి కూచుంటోందే!

అవును-ఇంకో గం...టైముందిగా. ఈలోగా రామూ వచ్చి వచ్చుగా. ఎంచక్కా తనూ టాయిలెట్టయి రెడీగా ఉంటే-అన్నయ్యా రాగానే బయల్దేరి పోవచ్చు. కాని తీరా పరికిణీ, జాకెట్టు వేసుకుని ముస్తాబయ్యాక అన్నయ్యరాకపోతే? అదోసిగ్గు! ఒద్దుబాబూ!

వీధిలో రోడ్డుకేసి చూస్తూ అలా నిర్జీవంగా అన్నట్టు నిలబడింది.

ఎవరో నాన్నారు ఎవరో అమ్మాయి (తనంతదే) చెయ్యిపట్టుకు షాపులు తిప్పుతున్నాడు. అందరు నాన్నలూ ఒక్కలా ఉండకూడదూ? అమ్మాయిల సర్దా చూచి, పాపం ఎంత సరదాపడుతున్నారో అని ఆలోచించ కూడదూ? ప్చ్! నాన్నగారి గదిలోకి తొంగి చూచింది. బుర్రమీసాలుచూస్తే భయం వేసింది జననికి. ఇంకా అడగడంకూడానా?—

అప్పుడే ఆరున్నర! దేవుడా దేవుడా! మా అన్నయ్య వేగం వచ్చేలా నువ్వయినా చెయ్యకూడదూ? కాని జననికి ఆ నమ్మకమూ లేదు. తన లాటి చిన్నపిల్లల మాటలు దేవుడు వినడని—అదేదో విశ్వాసం.

జనని అక్క సుజాత హడావిడిగా వస్తోంది. హైహీల్సు వేసుకుంది. అలాంటివి నాన్నగారు ఒద్దనరు మరి! జనని కాలు అడ్డుతగిలి సుజాత పడినంత పనయింది. "దార్లో నిలబడ్డావేమే మొద్దూ!" అని టకటక వెళ్ళిపోయింది.

అన్నయ్యని పంపించమంటే అక్కయ్యని పంపించాడేం దేవుడు అని ప్రశ్నించుకునే సరికి తళుక్కుమని ఏదో మెరిసింది.

అక్క దగ్గరకి పరిగెత్తింది. "అక్కా! అక్కా! మా మంచి అక్కవికదూ!"

'ఎందు కేం?"

"మనూళ్లో రైల్వే స్టేషనుందికదూ?"

"లేకేం?"

"శ్రీ రామ నవమి ఉత్సవాలు అక్క డోళ్ళంతా (ఉద్యోగులని ఉద్దేశం) చేస్తున్నారట!"

"అవునూ".

"ఇవాళ ప్రోగ్రామ్ సంగీత కచేరట!"

"ఆఁ హాఁ!"

"ఎన్నాళ్ళనుంచో సంగీత కచేరీ చూడాలని నా కెంతో ఉంది."

"ఓహో!"

"వెళ్తే బాగుండదూ?"

"ఎందుకు బాగుండదూ?"

"మనిద్దరం కలిసి వెళ్ళిపోలేమా అక్కా?"

"బాబోయ్!" సుజాత అరుపుకి ఉలిక్కిపడింది జనని.

"ఏం! చాలాదూరమనా?"

"బావుంది, బావుంది. రేపు నా ప్రాక్టికల్ పరీక్షేంకావాలి?" అంది సుజాత.

"ప్రాక్టికల్ పరీక్షకి చదవనక్కర్లేదుట కదూ!"

"థియరీ ఉండదేం?—ఎనిమిదిమార్కులేనా రాకపోతే నేనూ, నా పరీక్షా, ఇంకా మనమూ?"

జననికి దిక్కుతోచలేదు. సుజాతకి కొంచెం జాలివేసి "పైఏడాది పరీక్షలు తొందరగా అయిపోతాయి. అప్పుడు తప్పకుండా వెళ్దాం. నాకు మాత్రం చూడాలని లేదేవిటి?" అంది.


"ఆఁ - అప్పుడు బుర్రకథ, హరికథ, పెట్టారు, నా తలకాయకవి బోధపడితే కదా?"

"పోనీ-నువ్వు సంగీతం నేర్చుకుంటున్నావు కదా! వేరే చూసేదేమిటే?"

నువ్వు సినిమాస్టార్‌లా వుంటావు కదా?- మరి సినిమాలు చూసే దెందుకే?" కోపంగా అని-బుస బుస వస్తోన్న దుఃఖాన్ని అణుచుకుంటూ వంటింటి గుమ్మం దగ్గరికి వెళ్ళింది.

అక్కడికి వచ్చేలోగానే ఏదో అనుభూతి కలిగింది.

ఒక్కొక్కసారి అనుకోకుండానే ఇష్టమైన సంగతులు జరిగి ఆశ్చర్య ఆనందాల్లో తలమున్కలు చేసేస్తాయి, అలాగే రామూ అన్నయ్య ఇప్పటికిప్పుడు అనుకోకుండా వచ్చెయ్యకూడదూ?



హాల్లో జోరు శబ్దం అయింది. ఎక్కడ అకాశంగమౌతుందో అని బెదురుతూనే నెమ్మదిగా వెళ్ళింది జనని.

అనుకున్నంతా అయింది. రామూఅన్నయ్య కాదు. పెద్దన్నయ్యే!

కాని జనని మనసు పట్టువిడవని విక్రమార్కుడిలా వుంది.

"పెద్దా! నేనొక టడుగుతాను,ఇస్తావురా!"

"రా, పో అంటావే. రాస్కెల్ పెద్దవాళ్ళని?"

"అదికాదు పెద్దన్నా?"

"పెద్దన్నాలేదు గిద్దన్నాలేదు. అవతలికి పో! నాకు బోలెంత అఫీసు వర్కుంది."

"ఇంట్లో ఉండి అఫీసు వర్కంటా వేం అన్నయ్యా?"

"అవతలికి పొమ్మన్నానా?"

కోపం క్రొద్దీ వెక్కిరించడానిక్కూడా శక్తి లేక, దబ దబ వీధిలోకి వెళ్ళిపోయింది జనని.

దార్లో పెద్ద శబ్దంతో బస్సు టైరు బర్స్ట్ కావడంతో - ఇంకో అరగంట కంటా చేరిపోవచ్చునని అంచనా వేసుకుంటున్న రాము అదిరి పడ్డాడు. ఆ అదిరిపాటుతో తొందర పాటంతా చచ్చింది ఒక్కసారిగా. ఇక అంతే దానిరాత, నా ఏడుపూ ఇంతే! అనుకున్నాడు చెల్లెల్ని తలుచుకుంటూ.

ఏడుగంటలు దాటేసరికి ఇక వెళ్ళడం అనేది ఎంత సంభవమో తెలిసిపోయింది చిన్ని జననికి.

ఆ వేళ వీధిలో ఎలక్ట్రిక్ దీపాలు ఎందుకో వెలగలేదు. వెన్నెల మాత్రం గుడ్డిగా వెలుగుతూంది. అక్కడున్న స్తంభాన్ని అనుకుని తనొక స్తంభంలా నించుండి పోయింది.

మనసు ఒద్దు లెద్దూ అనుకుంటూనేవున్నా, తను లేకుండా ఎక్కడో జరుగుతున్న 'సంబరాన్ని' ఊహించుకోకుండా ఉండలేక పోతున్నది జనని.

'ఈ పాటికి పాట అరంభమై ఉంటుంది. ఏమో ఎవరు చెప్పారు? - ఇంకొంచెం అలస్యం కాకూడదా? అవి డెలా ఉంటుందో? సన్నగా నాజూగ్గా, తెల్లగా, రింగులు పెట్టుకుని - ఊహూ ముత్యాల కమ్మలు పెట్టుకుని. పువ్వులు, పెట్టుకొని అదే, గులాబీ పూలు పట్టుకుని - అందంగా కనిపిస్తూ పాడుతుంది కాబోలు. ఒకవేళ నల్లగా ఉంటుందేమో? సంగీతం ఇష్టంలేని నాన్నగారివల్ల రేడియో వినడం కుదరదుగాని - రేడియోలో తరుచుగా పాడుతుందటగా! ఎంతో తియ్యగా ఉంటుంది కాబోలు అమె గొంతుక. తన గొంతు ఎలా ఉంటుందో మనకి తెలీదు...

తన క్లాసు చదువుతున్న అమ్మాయిలంతా చక్కగా ఈ పాటికి అక్కడ హాజరయి ఉంటారు. ఉంటారేమిటి అయ్యారు. అప్పుడే వాళ్ళంతా వెళ్ళదలచుకున్నట్టు చెప్పారు. సినిమాలకు వెళ్తుంటారు క్లాసు పిల్లలంతాను. కాని అంతమందీ ఒక్కసారి కలుసుకోడానికి వీలుండదు. అందరూ కలిసి కబుర్లాడుకుంటూ ఎంతో చక్కగా కూర్చొనివుంటారు. భోజనానికి పిలుపు!

తనే మగాడై వుంటే ఎంత చక్కగా... ప్చ్... పోనీ- తమ్ముడు మరి కాస్త పెద్దవాడైనా కాడు. బొత్తిగా ఏణ్నర్థం పిల్లాడు. లేకపోతే ఎంతైనా చిన్నవాడే తనకంటేకనుక దబాయించుకుని లాక్కుపోయేది తనతో. మగ పురుగు కనుక తన కెంతో తోడు!

ఉయ్యాల్లో తమ్ముడు అర్థంలేకుండా నవ్వుతున్నాడు. వాడే నయం తనకంటే.

అడజన్మ అడజన్మ అని అస్తమానం అమ్మ అంటుంది ఇందుకే. ఇవాళ తెలిసింది.

తను పెద్దయ్యాక కార్టూన్లూ అవీ నేర్చుకుని ఈ మగవాళ్ళమీద పగ తీర్చుకోకుండా ఉంటుందా! అ రోజులూ వస్తాయి.

"అడవాళ్ళ సేవానిరతి చూసి సగ్గుపడి, చేసే ఉపకారమేం లేకపోయి, పైగా తగుదునమ్మా అని ఇదీ వరస!" అంది మొన్న శారదాకుమారి.

తన స్నేహితురాలి అక్క శారదా కుమారీ, వాళ్ళ ఒదినగారున్నూ వాదించుకొంటుంటే వినిపించినవన్నీ, ఇవాళ ఇప్పుడు వినిపించినట్టయ్యాయి.

"ఒదినా! మీ రెన్నయినా చెప్పండి!

నే నొప్పుకోను-ఒకసారా రెండుసార్లా! వరసగా నాలుగుసార్లు కఠినమైన దెబ్బలు తగిలేసరికి - ఆడదాని మనసెంత మాత్రపు గట్టిది కనుక !- గాయమూ కావచ్చు, రక్తమూకారొచ్చు; మచ్చ మాయకనూ పోవచ్చు" అంది శారదాకుమారి నిశ్చలకంఠం.

"ఆగవమ్మా ఆగు!" అంది ఒదినగారి కంఠం. "ఆడవాళ్ళ పొరపాట్లూ ఉంటాయి-"

"ఇదుగో మీలాంటి ఆడవాళ్ళుండగా అందుకు సంశయమా? ఆడాళ్ళ దుర్గతికి కేవలం మగవాళ్ళే కారకులు కారని నిరూపిస్తున్నారు మీరు" అంది శారదాకుమారి ఉద్రేకంతో. "ఆడది అడ్డమైన కష్టాలూ అనుభవించి, ఇక ఆపైన అనుభవించలేక ఆత్మహత్య చేసుకుంటే, 'చేతకాని ఆడది - సంసారాన్ని నడి సంద్రంలో ముంచి చచ్చింది పాడుముండ; తానైతే చచ్చింది, ఆ కుటుంబం ఎంత దుఃఖంలో మునిగి పడుంది?" అంటుంది లోకం. అదే పెళ్ళికాని పడుచై, ఏ సవితి పోరో పడలేక గన్నేరు కాయలు కొరికితే — "ఏ కారణం లేకపోతే ఎందుకు చస్తుందిలే? ఏదో తప్పు చేసేవుంటుంది. చేతులారా చేసుకున్న దానికి ఎవడేం జేస్తాడు?" అనే వ్యాఖ్యానం. ఫలానావాళ్ళ పద్మకుమారి చదువుకుంటా నంటోందట అని తెలీగానే "దానికి మెట్రిక్యులేషనప్పుడే గోటు! అది చదవకుండా [illegible]టుందీ పైచదువులు? ఇంట్లో [illegible]' గంజో తాగమనైనా చెప్పి చదువుతుంది! అదే లేనిపోని దుగ్ధ. అదే చదువు అనుకోకుండా ఆగిపోతే, లేక ఇష్టంలేక మానివేస్తే - "ముందూ వెనుకా ఆలోచించకుండా అందరూ చదువుతున్నారని ఆడపిల్లల్ని కూడా ముందుకు తోసి మళ్ళా వెనక్కి లాగడ మెందుకూ?' అని ఎవరికీ పట్టని బాధ వాళ్ళకే పట్టినట్లు కొందరి మాటలు. ఒక లేడీ లెక్చరరు ప్రేమించి పెళ్ళిచేసుకుంటే 'ఇలా చేస్తుందని ఎప్పుడో నాకు తెలుసు' అంటాడొక మనిషి. అదే పని ఒక లేడీ టైపిస్టు చేస్తే 'పులినిచూసి నక్కవాతెట్టుకుందట' అని అంటుందో అతివ. కొంతదీసి జాత్యంతర వివాహమైతే 'థూ' అని ఊసెయ్యడమే; ఆ సంబరంలో ఆడదే కనుక కొంచం పెద్దజాతి మనిషి అయిందా, ఇక దాని ఊసు తిట్లలోనే వస్తుంది. నిజానికి ఒదినా మీకు తెలీదు-పురోగమించే ఆడదానికి మగవాడెంత శత్రువో ఆడదీ అంతే. మరికాస్త ఎక్కువేమో! భర్త నీడలో నిక్షేపంలా



ఉన్నా, ఒక ఆడది షోకు చేసుకుని బజార్లో ఆ మూలనుండి ఈ చివరకు ఒంటరిగా పచారుచేయడం జరిగిందా - వెంటనే ఏదో 'అద్భుతదీపం' లాంటి బిరుదు వచ్చినట్టే. అమ్మలక్కలకదో అందమైన కాలక్షేపం. పెద్ద పట్నాల్లో అయితే పట్టించుకునే ఓపిక ఉండదు జనాభానుబట్టి."

శారదాకుమారిని ఆపుతూ ఒదినగారన్నారు: "ఈ మధ్య రచయిత్రుల సంఖ్య పెరిగి పోయింది. వాళ్ళ గురించీ చెప్పు—"

"ఉండండి! అదే చెప్పుకొస్తున్నాను. మళ్ళీ సమీక్షిస్తాను వినండి. ఆడది చదువుకుంటే —కొరకరాని కొయ్య కింద జమ. ఆడది ఉద్యోగం చేస్తే గతిలేనివాళ్ళకోవ. ఆడది ప్రేమించి పెళ్ళిచేసుకుంటే తెగించడం! పోనీ అని రిజిస్టర్ మారేజ్ చేసుకుంటే — లేచి పోవడం కింద లెక్క. ప్రేమించి ఊరుకుంటే చెడిపోయిందని అపవాదు. ప్రేమించి—వేరే పెళ్ళి చేసుకుంటే ఉత్త "అబల!" లేదా మోసకత్తె! పెళ్ళాడి, లక్షణంగా పిల్లల్నికని భర్తను అనుసరిస్తే కేవలం అమాయకురాలు — అంటే చాలా దద్దమ్మ. ఇక ఎలా ఉంటే ఆడది మగవాడి హుందాతనాన్ని సంతరించుకోగలదు? కాస్త షోగ్గా తిరిగితే షోకులాడి; కాస్త స్వేచ్ఛగా తిరిగితే తిరుగుబోడి; ఠీవిగా నడిస్తే బరితెగించిన ఆడదీ కదా!"

"మరి రచయిత్రులమాట చెప్పావుకావు-"

"రచయిత్రులని పట్టించారేమిటీ? అక్కడా అంతే! పత్రికా సంపాదకులు మగవాళ్ళేగా సాధారణంగా! ఎక్కడో నూటికొకరు ఆడ సంపాదకులున్నా, అలాటి పత్రికకు ఆడవాళ్ళే పంపరు ఆర్టికల్సు. ఇహ చెప్పేదేమిటి? మొహం తుడుపూ, లాభదృష్టీ ఉందిబోలెడు. లాభదృష్టి అంటే ఏమిటంటే - రచయిత్రుల్ని సినిమా కళ్ళతో చూడటం. ఆడ రచయిత కదా అంత పబ్లిసిటీ అనటం! నిజాయితీని దాచిపెట్టి నీతిని రాస్తే "బుద్ధిమంతురాలు" అనటం - మళ్ళా ఇవన్నీ ఆవిడ విషయంలో నిజాలేనా అని అనుమానం. నిర్మొగమాటంగా నిజాన్ని రాస్తే, బట్టలిప్పేసింది అనడం! నిజన బట్టలు వేసుకుంటుంది కాబోలు! అలా వ్రాసిం రచయిత్రి జీవితచరిత్ర చాలా చెడ్డదై ఉంటుందని ఊహలు. ధైర్యంగా అన్నీ వ్రాసే రచయిత్రికి, ముద్రణాలోపమా, మీ లోపమా, సంపాదకుడి లోపమా అని లేఖలు. సమర్ధనీయంగా వ్రాస్తే- "మెప్పించుకోడానికి రాయాలంటే ఎంతసేపు?" అనే మాటలు. ఆడవాళ్ళ రచనలు ఎలావుంటే మెచ్చుకోవాలో తెలీని విమర్శకుల అయోమయ అసందర్భపు విమర్శ[illegible] ఆడది వ్రాసిందా మగాడు రాసిందా అనే పాఠకుల పక్షపాత దృష్టీ..."

శారదా కుమారి ధోరణి ఇక ఒదినగారు భరించలేక పోయారు, వాళ్ళాయన మీదా మొత్తం మొగాళ్ళ మీదే జాలిపుట్టుకొచ్చినట్టుంది. "శారదమ్మా! నువ్వన్నట్టు ఆడదానికి అన్ని విధాలా అన్యాయం జరుగుతోంది ఒక్క సినిమాలోకంలో తప్ప"-అన్నారు అక్కడికా సంభాషణ ఆపబోయి.

"మీ మాటల్లోనే ఉంది వేళాకోళం. బయటికి కనిపించే ఆ విలువ విలువేనంటారా? కాస్త కళ కనుమరుగవ్వగానే ఎంత వెటకారమని? ఒక ప్రఖ్యాత నటీమణి ఎదురుగా ఒక పరాయి మగవాడు నవ్వకుండా మాట్లాడాడంటే నేను నమ్మను. అలా జరిగినా అదో వింత."

"నవ్వినంత మాత్రాన సీరియస్ నెస్ చెడినట్లా?" అని ప్రశ్నించారు వదినగారు.

"ఏమో-అక్కడ నవ్వు కొక కృత్రిమపు తొడుగువస్తుందని నా అభిప్రాయం. కళాకారుడైతే మచ్చలేని మహాపురుషుడు. కళాకారిణి ఐతే 'చంద్రుడికీ మచ్చ ఉంటుందిలే' అనే వెతుకులాట."

"ఇంకా?"

"ఇందిరాగాంధి ప్రధానమంత్రిణి అయినందుకు పైదేశాలు ముక్కుమీద వేలేసుకుంటే ఒద్దనను. కాని మామూలు స్త్రీల గతి. వచ్చి చూడమనాలి! పరదేశాల్లో కొన్నింట "స్త్రీల సమానత్వ హక్కులు" అనేవి మనలా ఉత్త అరుపులు కాకపోవచ్చు. అక్కడ స్త్రీ బతే

అందమైన ఆటవస్తువు. మన స్త్రీల విషయంలో అలాకాక ఒక 'పూజ్యభావం' ఇస్తారు మన వాళ్ళు. ఏం లాభం-ఆ పూజ్యభావం చుట్టూ వెయ్యి అనుమాన సర్పాలూ, లక్ష నిబంధనా సూత్రాలు, కోటి ద్వార పాలక విగ్రహాలు. పై దేశాల్లో ఆడది ప్లాస్టిక్ బొమ్మ అయితే, మన దేశంలో స్త్రీ మట్టిబొమ్మ. మట్టిబొమ్మను ఎవరేనా గట్టిగా విసిరి కొట్టారంటే మట్టిలోనే కలుస్తుంది. 'అమ్మా నన్నాదుకో' అని భూమాతనే కౌగలించుకోవడం సహజం మనకు!"

అలా ఆ రోజు జరిగిన శారదాకుమారి అవిరళ వాగ్ధోరణి అంతా ఇప్పుడు వినిపించినట్టయింది జననికి. ఆ నాడు అర్థం కాలేదు. ఈనాడు అర్థ మయింది. నానాటికీ స్త్రీకి అన్నీ అర్థమౌతాయి క్రమేణా. ఎన్నటికీ అర్థంకానిది ఒక్కటుంది, తనకున్న విలువ సంఘ దృష్ట్యా ఎటువంటిదీ అనే ప్రశ్న అది.

భోజనానికి రెండోమాటు పిలుపు వినిపించింది లోనుంచి.


విసుగు; దుఃఖం, చేతగానితనం ముంచుకొచ్చాయి జననికి. మడమలు నేలకి గట్టిగా తగిలేలా శబ్దం చేసుకుంటూ లోపలికి వెళ్ళింది.

"ఏం? నీకేం బొట్టూ, కాటుకా పెట్టి పిలవాలేమిటి? అందరూ వచ్చినట్టు రాలేవ్?" అని అమ్మ కోప్పడింది.

జనని కళ్ళల్లో కారుమబ్బులు క్రమ్ముకుని ఉన్నాయి. పెనుతుఫానుకు ఇంక అట్టే వ్యవధిలేదులా వుంది. కంచంముందు ఏడిస్తే ఎందుకేడ్చిందో అందరికీ కావాలి. సంగీతం కోసం అని తెలిస్తే నాన్నగారు రుద్రులైపోతారు. "దేనికోసమన్నా ఏడవండి, సంగీతం లాంటి అర్థం లేని విషయాలకోసం ఏడవకండి" అనేసినా అనగలరు.

ఏడుపును బలవంతాన నిగ్రహించుకుని అన్నం తినడం ముగించింది.

వీధిలోకి వెళ్లబోయింది. నాన్నగారు "అమ్మడూ ఇలారా" అనిపిలిచి పిప్పరమెంటు ఇచ్చారు. అది పట్టుకు వీధిలోకి వచ్చింది. ఛీ! ఎప్పుడూ తిండి! తిండి! తిండికోసమేకాబోలు మనుషులు పుట్టేది? -ఆ బిళ్ళను చూస్తున్నకొద్దీ అసహ్యం పుట్టుకు రా సాగింది. చూసి చూసి



దాన్ని దూరంగా గిరవాటు పెట్టేసింది. చేదుగామారిన వాతావరణంలో తీపి రాణించదు దుష్టుల సామీప్యం లాగ.

లోపలికి వచ్చి తన పడకమీద వాలిపోతూ చిన్న చిన్న మాటల్లో మనసుకి ఏదో చెప్పి ఊరుకోమంది.

"ఆడదానిగా నేను పుట్టాను. మగవాడికి ఆడదంటే అలుసు. అలా అని అమ్మేకాదు —ఇంకా చాలామంది ఆడాళ్ళు అంటూంటే వింది తను. ఆడదానికి ఒక గిరి గీస్తారుట. అక్కడుండ మంటారు. ఏ ప్రయాణం చేస్తున్నా, ఎంత పురోగమిస్తున్నా తనవెంట ఆడదుంటే ఇంచుక చిరాకు. కొందరికి కోపం. కొందరికి నిర్లక్ష్యం, కొందరికి ఆటంకం, కొందరికి అవమానం. కొందరికి భయం, మరేమో కొందరు మగవాళ్ళకి సిగ్గు. అదిచూచిన, గమనించిన, ఆడవాళ్ళకూ అదో రకమైన సిగ్గు, అనాదిగా ఆడదిలా సిగ్గులో మగ్గిపోతున్నది......కొన్ని కోరికలు తీరనప్పుడు ఆ కోరిక ఉత్తిపోల్లు అనుకొంటే హాయిగా ఉంటుంది,

"కొన్ని గమ్మత్తయిన కారణాలవల్ల అప్పుడప్పుడు కార్యక్రమాలు ఆగిపోతుంటాయి. అలాగే—ఈ ఊళ్ళోపాటకచేరీ కావటంలేదు. ఎవరూవెళ్ళటం లేదనుకుంటాను. లేదా ఈ పాట కచేరీ—ఎక్కడో — వందలమైళ్ళదూరంలో జరుగుతుందను కుంటాను. ఏం పోయింది?—

జనని కళ్ళు క్రమంగా బరువెక్కసాగాయి. నిద్రాదేవి జోలపాడింది—

ప్రపంచంమీదే ఈసులాటి, రోతలాటి సంక్షోభభారంతో జనని చిన్నహృదయం నిద్ర రోయింది.

*   *   *

ప్రొద్దున్న ఆరుగంటలవేళ - జననికి మెలకువ వచ్చింది. మెలకువ వచ్చీ రాగానే మెదడు తనపని ఆరంభించింది. లోపల్నించి వినవస్తున్న రామూ గొంతుక అందుకు మరింత సహకరించింది. వచ్చేశాడన్నమాట!

...ఓసారి ఎదురింటివాళ్ళ సన్నజాజి తీగె ఎద్దునమిలేస్తోంది. అదిచూచి సుజాతక్క ఒకటే అరుస్తోంది. ఆ ఎద్దు పీనుగ వినిపించు కుంటేగా! ఇంతలో అక్కయ్యగోల విని కాబోలు-ఒక పెద్దమనిషి 'అయ్' అంటు అరిచాడు ఆ మూలనుంచి. పెళ్ళికూతుర్లా వెళ్ళింది.

అది అక్కయ్యలోని ఆడతనాన్ని గుర్తించిందన్నమాట!

ఒకసారి వంటింట్లోకి అమ్మలేని సమయం చూసి, కుక్క తగలడింది. తను కర్రతో ఒక వైపు బాదుతున్నా కదలదే! ఆఖరికి "ఏమిటే అది?" అని అన్నయ్య గండుపిల్లిలానో, గాడిద లానో అరిస్తేతప్ప భయపడి చచ్చిందికాదు.

అంటే జంతువులకూడా కొన్ని కొన్ని ముఖ్యమైన సంగతులు తెలుసు!—

జననికి మెలకువ రావడంచూచి రాము సుడిగాలిలావచ్చి పక్కను కూచున్నాడు.

"చెల్లీ - నేనేం చేసేది చెప్పమ్మా - చెయ్యవలసిందల్లా ఆ పాడు బస్సే చేసింది—" అన్నాడు బాధపడుతూ, జనని మనస్సును ఓదారుస్తూ.

జనని సూటిగా చూడలేక కళ్ళు తెరవలేదు. మరింత బిగించుకుంది.

జనని బుగ్గలమీద కన్నీటి ధారలు చూచి రాము విస్తుపోయాడు క్షణం.

"చూడు జన్నీ."

ఆత్రంగా "నీకు సంగీత కచేరీ ఈ అన్న ఎప్పటికీ చూపించలేడనే అనుకుంటున్నావా? ఇంత మాత్రానికి- ఛ- ఏడుపా?" అన్నాడు. అని కన్నీళ్లు తుడవబోయాడు. కాని అవి కన్నీళ్ళు కావు. కన్నీటి చారికలు.

రాత్రి ఏడుస్తూ పడుకుంది కాబోలు జనని! రాము తెల్లబోయాడు. బాధపడ్డాడు.

ఆడదాని కన్నీరు తుడవడానికి కొందరున్నారీ లోకంలో. కాని తుడిపించుకొనే అదృష్టం మాత్రం ఆడదానికి లేదు అని విధి ఆ గదిలోనే వికటాట్టహాసం చేయడం ఇద్దరూ వినలేదు. జనని చటుక్కున లేచి కూచుంది. "పోనీలే మరోసారి—" అని నీరసంగా నవ్వి పళ్లు తోముకోడానికి పెరట్లోకి నడిచింది.

★